


-శ్యామల జయరామరెడ్డి

డాక్టరు వెదురుబద్దల తడిక నెట్టుకొని గుడిసెలోకి అడుగెట్టాడు. గుడిసెలోని ఒకే ఒక నులక మంచంమీద పది, పన్నెండేళ్ల పిల్లవాని తల ఒడిలో పెట్టుకుని పాత గుడ్డతో విసురుతూన్న ఓబులేసు గబగబా పైకి లేచాడు—''వచ్చారా, డాక్టరుబాబూ...'' అంటూ.

డాక్టరు సమాధాన మివ్వలేదు. వంగి పిల్లవాడి నాడి పరీక్షించాడు. బాగ్ తెరిచి కఫ్ కట్టి బ్లడ్ ప్రెషరు చూడటం మొదలెట్టాడు. బ్లడ్ ప్రెషరు చాలా తక్కువగా ఉంది. వాంతులు, విరేచనాలు ఎడతెరిపి లేకుండా, ఆ పిల్ల వానికి తెలియకుండా అయిపోతున్నాయి. కొత్తగా ఉద్యోగంలో చేరి, డాక్టరు వెంట వచ్చిన కాంపౌండరు బిక్కు బిక్కుమంటూ గుడిసె నలు వైపులా చూడసాగాడు. కొడిగట్టిన చిన్న కిరసనాయిలు బుడ్డి అంత్య దశలో రోగి గుండెలా రెపరెపలాడుతూంది. ముక్కులు బద్దలు చేసే దుర్వాసన. ఎండిపోయిన జొన్నమెతుకుల మట్టికుండ, తిని కడగకుండా ఎంగిలి కంచాలు. చీకట్లో కూడా జుయ్యిన ఈగలు ముసురుతున్నాయి. ఒక పక్క పొయ్యిలో ఆరిపోయిన చితుకుపుల్లలు. వెదురు బొంగు మీద రెండు, మూడు గుడ్డలు వాసి చిడ్డు ఓడుతున్నాయి. మరొక పక్క ఒక స్త్రీ ఆకారం— ఆ పిల్లవాని తల్లి కాబోలు— మూటలా ఉండ చుట్టుకొని పడుకొని ఉంది. కాంపౌండరు మొదట అనుకొన్నట్లు ఆ స్త్రీ నిద్ర పోవటం లేదు. అణిచి పెట్టుకొన్న దుఃఖం అగ్నిపర్వతంలా బద్దలైపోగా ఉండి ఉండి ఆ స్త్రీ రొమ్ములు ఎగిరెగిరి పడుతున్నాయి. అదృశ్యంగా మృత్యుదేవత చేస్తూన్న విలయ తాండవం ఆ గుడిసెలో స్పష్టంగా కనిపిస్తూంది. ఇనుప గజ్జెల మోత ప్రస్ఫుటంగా వినిపిస్తూంది... గెడ్డం, మీసాలుకూడా సరిగ్గా మొలవని ఆ కాంపౌండరు భయంతో వణికి పోయాడు.

డాక్టరుకూడా చిన్నవాడే. అయినా, చావు బ్రతుకుల మధ్య పోరాటం అతనికి

కొత్తకాదు. నిరుద్వేగంగా స్టెతస్కోపును, బి. పి. అపరేటస్‌ను బాగ్‌లో పెట్టి లేచి నిలబడ్డాడు. "విరేచనాలు ఎప్పట్నుంచి?"

"నిన్న మాపిటేలనించి, బాబూ. . . అర్ధరేతిరి నించి వాంతులుకూడా. . . తెంపే లేదు. . ."

"ఇప్పటివరకూ మందులేం ఇచ్చారు?" పక్కనే ఉన్న హెల్త్ ఇన్‌స్పెక్టర్ని అడిగాడు డాక్టరు.

"ఆరు గంటల కొకసారి క్లోరో మైసిటిన్ ఇస్తున్నాం. కాని, వాంతుల వల్ల ఇమడటం లేదు."

"ఎలా ఇముడుతాయి— ఇది కలరా!"

"సెలైన్ ఇద్దామంటారా?" కాంపౌండరు అన్నాడు.

"లాభం లేదనుకొంటాను. అయినా, ప్రయత్నం చేద్దాం." ఇంగ్లీష్‌లో అన్నాడు డాక్టరు.

కాంపౌండరు బయటకు వెళ్ళాడు, జీపులో ఉన్న సామాను తీసుకు రావటానికి. ఇంకా ఇద్దరు ముగ్గురు ఆరోగ్య కేంద్రం సిబ్బంది చీకట్లో జీపులో కూర్చుని కునికిపాట్లు పడుతున్నారు. "ఎలా ఉంది ఆ పిల్లవాడికి?" ఎవరో అడిగారు కాంపౌండర్ని.

"లాభం లేదనుకొంటాను. డాక్టరుగారు మరో రెండు గంటలు ముందు వచ్చి ఉంటే ప్రయోజనం ఉండేది. కాని. . . ఇప్పుడు. . . ప్చ్!"

"డాక్టరుగారు ముందు రమ్మంటే ఎలా వస్తారు? పెట్రోలు బంకువాడు అప్పు అయితే పెట్రోలు పొయ్యను పొమ్మన్నాడు. సెంటర్లో మందుల్లేవు. కొనటానికి బడ్జెట్ లేదన్నాడు బి. డి. ఓ. మధ్యాహ్నం నుంచి వీళ్ళందర్నీ బ్రతిమాలటమే సరిపోయింది డాక్టరుగారికి."

కాంపౌండరు చీకట్లోనే కావలసిన సామాను తీసుకొని తిరిగి గుడిసెలోకి వచ్చాడు. గబగబా సెలైన్ స్టాండు అమర్చి సిరింజి డాక్టరు చేతికి అందించాడు.

పిల్లవాడికి స్పృహ లేదు. కళ్ళు లోతుకు పీక్కుపోయి గుంటలు పడి ఉన్నాయి. చెమట పట్టి ఒళ్ళంతా చల్లబడి పోయింది. నాడి అందటం లేదు. డాక్టరు స్పిరిట్‌తో శుభ్రం చేసి సూది లోపలకు గుచ్చాడు. వెయిన్ దొరకలేదు. బయటకు లాగి మళ్ళీ గుచ్చాడు. చల్లగాలి వీస్తున్న ఆ తెల్లవారు ఝామునకూడా డాక్టరు నుదుటిమీద నుండి చెమట బొట్లు జారటం మొదలెట్టాయి. అయిదారు సార్లు ప్రయత్నించాడు— ముంజేతి దగ్గరా, కాలి దగ్గరా. కాని, ప్రయోజనం లేకపోయింది. వెయిన్ దొరకలేదు. సివియర్ డీహైడ్రేషన్‌తో వెయిన్స్ అన్నీ కొలాప్స్ అయి ఉంటాయి. నిస్పృహతో సిరింజి బయటకు లాగివేసి ముఖంమీది చెమటను తుడుచుకొన్నాడు డాక్టరు.

ఓబులేసుకు డాక్టరుగారు బాగా తెలుసు. తన భార్యకు పిల్లలు పుట్టకుండా ఆపరేషను చేసింది ఆయనే. అప్పుడప్పుడు ఆ పల్లెకు వచ్చి, అందర్నీ పలకరించి మందులిచ్చి పోతూ ఉంటాడు. ఆ డాక్టరంటే ఆ ప్రాంతంలో అందరికీ మంచి విశ్వాసం. అలాగే ఓబులేసుకు కూడా డాక్టరుగారి చేతుల్లో పడ్డాక తన పిల్లవాడి కేమీ ప్రమాదం ఉండదని ప్రగాఢమైన నమ్మకం. అయినా, డాక్టరుగారి ముఖంలోని నిస్పృహ చూసేసరికి ఓబులేసుకు ఏదో అనుమానం కలిగింది.

"ఏమైంది, బాబూ?" ఆత్రతగా ప్రశ్నించాడు ఓబులేసు.

"ఏమీలేదు. నే నొక గంట ముందు వచ్చి ఉంటే. . ." డాక్టరు తన పొరపాటు గ్రహించి హఠాత్తుగా ఆగిపోయాడు.

అప్పటికే భోరున ఏడవసాగాడు ఓబులేసు. "బాబూ! నా చెర్మం వొలిచి చెప్పులు కుట్టిస్తాను. నా కొడుకుని ఎట్లాగైనా బతికించండి, బాబూ!"

డాక్టరు సానుభూతితో ఓబులేసు భుజం మీద చెయ్యి వేసి ధైర్యవచనాలు చెప్పసాగాడు. ఓబులేసు కొంచెం శాంతించిన తరవాత కాంపౌండరు వేపు తిరిగి, "ఓపెన్ మెథడ్ ప్రయత్నిద్దాం. కైలో కెయిన్, బ్లేడు తీసుకురా" అన్నాడు.

టార్చిలైటు వెలుతురులో ఆ కుర్రడాక్టరు సున్నితంగా ఇన్‌సైజ్ చేసి నీట్‌గా వెయిన్ వెలికి తీశాడు. డాక్టర్ చేసే పనిని నిశ్శబ్దంగా గమనిస్తున్న కాంపౌండరు కళ్ళలో మెచ్చుకోలు కనిపించింది. సూదిని వెయిన్‌లోకి గుచ్చి సెలైన్ సెట్‌కు కనెక్ట్ చేసి, పించ్‌కాక్ వదులు చేశాడు. రెండు, మూడు క్షణాలు గడిచినా ఒక్క చుక్క మందుకూడా కిందకు దిగలేదు. కారణ మేమిటి? సూది లావు ఉన్నదే. 'బ్లాక్' అయ్యే అవకాశం లేదు. పించ్‌కాక్ పూర్తిగా వదులుచేశాడు. అయినా, సెలైన్ ప్రవహించలేదు. పిల్లవాడి చేయి పట్టుకొని నాడి చూశాడు. నాడి లేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలుకూడా ఆగిపోయాయి. కుర్రవాడి ప్రాణం పోయింది!

డాక్టరు మౌనంగా సూది బయటకు లాగేసి, అడ్‌హెసివ్ ప్లాస్టర్‌తో ఆ చిన్న గాయాన్ని మూసేశాడు. డాక్టరు మాట్లాడకపోయినా, పిల్లవాడి ప్రాణం పోయిన విషయం కాంపౌండరు గ్రహించి



రాతిలో నాతి రూపు

చిత్రం—వై. బాలయ్య (సిద్దిపేట)

సిగరా సామానంతా సర్దటం మొద లెట్టాడు. ఏదో ఆలోచిస్తూ శూన్యం లోకి చూస్తున్న ఓబులేసుకు మాత్రం తన కొడుకు ప్రాణం పోయిన సంగతి తెలియలేదు. కాంపౌండరు తన సామానంతా సర్దుకొని డాక్టరు వెంట బయటకు వెళ్లటం చూసి, "ఏం, బాబూ, ఏమైంది? పోతున్నారేం?" అంటూ ఆదుర్దాగా ప్రశ్నించాడు.

అప్పటికే డాక్టరు వాకిలి దాటాడు. వెనక్కు తిరిగి— "లాభం లేదు, ఓబులేసూ! ప్రాణం పోయింది" అన్నాడు.

వెనకనుంచి ఒక్కసారిగా వినిపించాయి— ఓబులేసూ, అతని భార్యా హృదయవిదారకమైన ఏడ్పులు.

డాక్టరు జీపు పక్కన నిలబడి సిగరెట్ వెలిగించాడు. సమయం నాలుగున్నర కావస్తోంది. పూర్తిగా తెల్లవార లేదుగాని, నలుపైనరా అప్పుడే తూరుపు వెలుతురు విచ్చుకొంటూంది. గితుకుల బజారుకు రెండు వైపులా తాటాకు గుడిసెలు రాత్రంతా పైశాచిక నృత్యంతో అలిసి నిద్రపోతూన్న నిశాచరుల్లా చింపిరి తలలు వేలాడేసి ఉన్నాయి. మామూలు రోజుల్లో ఆ బజారు ఆ సమయానికి చద్దిబువ్వలు తిని పొలం పోయే జనంతో సందడిగా ఉంటుంది. కాని, ఆవేళ ఎక్కడా ఏ విధమైన అలికిడిగాని, జన సంచారంగాని లేదు. పేకువజాము ప్రశాంతతను చీల్చుకొంటూ ఓబులేసు గుడిసెలోంచి వినవచ్చే ఆక్రందనకూడా ఎవరినీ బయటకు రప్పించలేకపోయింది. అందరూ మేలుకొనే ఉన్నారు. ఓబులేసు గుడిసె ముందు జీపు ఆగటం, అప్పు డప్పుడు వినిపించే పాడి మాటలు, గుండెలు పిండివేసే ఆ దంపతుల ఏడుపు— అన్నీ వింటూనే ఉన్నారు. కాని, కలరా వ్యాధి మహమ్మారిలా వ్యాపించిన ఆ ఊరిలో, ఆ విశాసమయంలో బయటకు వచ్చే ధైర్యం ఎవరి కుంటుంది?

చివరికంటా కాలిన సిగరెట్ దూరంగా విసిరివేసి, "ఊర్లో ఇప్పటికి మొత్తం ఎన్ని కేసులు వచ్చాయి?" అని డాక్టరు ప్రశ్నించాడు.

"మొన్న సాయంత్రం వరకూ ఎనిమిది కేసులు. ఇనాక్యులేషన్స్, క్లోరి నేషన్, డిస్ఇన్ఫెక్షన్ మొదలైన వన్నీ చేస్తూనే ఉన్నాం. నిన్న ఒక్క కేసుకూడా లేదు. తగ్గిపోయిందనే అను కొన్నాం. కాని, ఈవేళ వ్యాధి మళ్లా ఎందుకు ఉగ్రరూపం దాల్చిందో అర్థం కాకుండా ఉంది" అన్నాడు హెల్త్ ఇన్స్పెక్టరు.

"కారణం చెప్పలేం. బహుశా విపరీతంగా ఉన్న ఊగిరి వల్ల కావచ్చు. ఏదుకైనా మంచిది బాగా వెలుతురొచ్చే వరకూ ఉండి ఊళ్లో పరిస్థితి ఎలా ఉందో తెలుసుకొనే వెళదాం. మళ్లీ మళ్లీ రావ టానికి పెట్రోలు చాలదు."

"జబ్బుకు భయపడి అందరూ తలుపులు వేసుకొన్నారు. బాగా తెల్లవారితే గాని జనం బయటకు రారు."

* * *

ఆంజనేయశర్మ తన ఉద్యోగాన్ని, తను పని చేస్తున్న పత్రికనూ, ఆఫీసులో ఎవరూ లేనట్లు తననే ఈ పనికి నియ మించిన ఎడిటర్‌నీ మరో మారు తిట్టు కొన్నాడు. గతుకుల మట్టి రోడ్డు మీద అరువు తెచ్చుకొన్న స్కూటరు ఎగిరెగిరి పడుతూ దుమ్ము లేపుతూంది. చెమటతో తడిసిన ముఖం మీద ఎర్ర దుమ్ము అట్టలా పేరుకొనిపోయింది. తెల్లని టెరికాటన్ షర్టు ఎరుపుకి తిరిగింది. జంగమహేశ్వరపురం! ఎక్క డున్నట్లు ఈ ఊరు? ఎన్ని మైళ్ళు ప్రయాణం చేసినా ఇంకా రాదేం? ఆ ఊర్లో ప్రైమరీ హెల్త్ సెంటరు ఒకటున్నది. అందులో పనిచేసే ఒక డాక్టరుకు రాష్ట్రమంతటిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎక్కువ చేయించినందుకుగాను మొదటి బహుమానం వచ్చిందట. రేడియోలో తెగ ఊదేశారు. ఇప్పుడు తను వెళ్లి ఆ డాక్టర్ని ఇంటర్వ్యూ చేసి ఒక వార్తా వ్యాసం తయారుచెయ్యాలి.


రోడ్డు పక్క తాటిచెట్లు కింద కల్లు లొట్టెలతో ఒక లంబాడీవాడు కూర్చుని ఉండటం చూసి, స్కూటరు ఆపి, "జంగమహేశ్వరపురం ఇంకా ఎన్ని మైళ్ళుంది?" అని అడిగాడు శర్మ.

లంబాడీవాడికి అర్థం కానట్లుంది. వాడు సమాధానం చెప్పలేదు. శర్మ మళ్లీ అడిగాడు. "జంగమేసపురమా? అల్లదుగో, ఆ కనపడేదే!" అంటూ నిర్లక్ష్యంగా చేయి చూపాడు.

శర్మకు ఏమీ కనపడలేదు. మనసులో తిట్టుకొంటూ స్కూటరు స్టార్టు చేశాడు. మెరకమీద నుండి కిందకు దిగగానే కనిపించింది ఊరు. ఊరు బయటే ఉన్నది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. శర్మ స్కూటరు దిగి కేంద్రంలో అడుగెట్టాడు. నిర్మానుష్యంగా ఉంది. ఒక గదిలో మాత్రం తెల్లచీర ధరించిన ఒక యువతి, ఇద్దరు మునలమ్మలు తెచ్చిన సీసాల్లో ఎర్రమందు పోస్తూ వారితో కబుర్లాడుతూంది.

"డాక్టరుగారు లేరా?" శర్మ ప్రశ్నించాడు.

"లేరండి. గుట్టమీద పల్లెలో కలరా



ఉందని రిపోర్టు వస్తే రాత్రి జీపులో వెళ్ళారు. ఎప్పుడొస్తారో తెలియదు'' అన్నది తెల్లచీర యువతి.

"గుట్టమీద పల్లె? అదెక్కడ?"

"ఇప్పుడు మీరొచ్చిన రోడ్డే— ఇంకా ఎనిమిది మైళ్ళు పోవాలి. తిన్నగా ఆ వూళ్ళోకే పోతుంది రోడ్డు."

శర్మ మళ్ళీ స్కూటరు స్టార్టు చేసి, వాచీ చూసుకొన్నాడు. తొమ్మిదిన్నర. మరో అర గంటలో ఆ పల్లె చేరగలిగితే డాక్టర్ని అక్కడే ఇంటర్వ్యూ చెయ్యొచ్చు. రెండు గంటలకల్లా తిరిగి ఇంటికి చేరవచ్చు.

ఆ పల్లె నిజంగా గుట్టమీదనే ఉంది. ఊరి బయట ఎలిమెంటరీ స్కూలు యుద్ధరంగంలో హాస్పిటల్లా ఉంది. ఏడెనిమిది బెంచీల మీద కలరా తగిలిన రోగులు ఉన్నారు. ప్రమాద స్థితిలో ఉన్నట్లుంది, అందరికీ సెలైన్ ఎక్కిస్తున్నారు. ఒక పాత టేబులు మీద సెలైన్ బాటిల్సు, మందులు, దూది, సిరింజెస్ ఉన్నాయి. ఒక మూల ఎనామెల్ బేసినులో డెట్టాల్ లోషను. అప్పుడే మోసుకొచ్చిన ఒక రోగికి సెలైన్ డ్రిప్ పెట్టి చేతులు కడుక్కొంటున్నాడు డాక్టరు.

"గుడ్ మార్నింగ్, డాక్టర్! నా పేరు ఆంజనేయశర్మ. తెలుగు ప్రభ విలేఖర్ని. మిమ్మల్ని ఇంటర్వ్యూ చెయ్యటానికి ఈ వేళ అప్పాయింట్‌మెంటు ఇచ్చారు— గుర్తుందా?"

డాక్టర్ ఒకసారి వెనక్కు తిరిగి చూసి, "నాకు తీరిక లేదు వెళ్ళండి" అన్నాడు కటువుగా.

డాక్టర్ మాటల్లోని అనాదరణకు విలేఖరి శర్మ తొణకలేదు. చిరునవ్వు నవ్వుతూ అన్నాడు: "ఓ, డాక్టర్, యు ఆర్ డిసప్పాయింటింగ్ మీ! స్టెరిలైజేషన్సులో రాష్ట్రమంతటికీ మొదటి బహుమతి పొందిన మీరేనా ఇలా మాట్లాడుతూంది? లేక పొరపాటున నేను తప్పు అడ్రెసుకు వచ్చానా?"

"అడ్రెసు తప్పుకాదు. ఆ మూర్ఖుణ్ణి నేనే!"

"థాంక్ గాడ్! మీ విసుగుకు కారణం నాకు అర్థమైంది. మీరు కేవలం అధిక శ్రమ, బడలికతో ఓర్పు పోగొట్టుకొంటున్నారు. మీ కిప్పుడు కావలసింది ఒక కప్పు వేడి వేడి కాఫీ. కమాన్, డాక్టర్!"

"కాఫీయా! ఈ పల్లెలో ఆ పేరు విన్న వాళ్ళెవరూ లేరు."

"డోన్ట్ వర్రీ, డాక్టర్. నేను తెచ్చాను." శర్మ తన చేతిలో ఉన్న పెద్ద ఫ్లాస్కు చూపించాడు.

డాక్టరు ముఖంలో కాఠిన్యం మాయమైంది. చేతులు తుడుచుకొంటూ బల్ల మీద కూలబడ్డాడు. శర్మ ఫ్లాస్కు మూతలోకి కాఫీ వంచి డాక్టరు కిచ్చాడు. పొగలు కక్కుతున్న వేడి వేడి కాఫీని ఆత్రంగా తాగేశాడు డాక్టరు.

కాంపౌండరుకూ, హెల్త్ ఇన్స్పెక్టరుకూ కాఫీ ఇచ్చాడు శర్మ.

"మీ దగ్గర సిగరెట్లేమయినా...?" డాక్టరు అడిగాడు.

"అయిదు పాకెట్లు ఉన్నాయి. కావాలంటే అన్నీ తీసుకోండి" అంటూ జేబులోంచి సిగరెట్ పాకెట్లు తీసి బల్లమీద పెట్టాడు శర్మ.

"థాంక్స్!" అంటూ డాక్టరు సిగరెట్ వెలిగించాడు.

వాతావరణంలో టెన్షన్ తగ్గిపోయింది. అందరూ రిలాక్స్ అయ్యారు. డాక్టరు ఎంతో సంతృప్తితో సిగరెట్ పీల్చడంలో నిమగ్నుడై పోయాడు.

"మీ లాగా సేవ చేసే డాక్టర్ని ఎప్పుడూ చూడలేదంటున్నారు ఈ ఊళ్లో వాళ్లందరూను. వాళ్ల దృష్టిలో మీరు దేవుడై పోయారు. ఇక్కడి కొచ్చి చూశాక నేనూ అదే అనుకొంటున్నాను. కాబట్టి మీ టైము వృథాచెయ్యటం నాకు ఇష్టం లేదు. మీరు రెడీ అంటే పది నిమిషాల్లో ఇంటర్వ్యూ ముగించేస్తాను. వ్యాసంలో సెంటిమెంట్, మెలోడ్రామా జొప్పించి బ్రహ్మాండంగా తయారు చెయ్యమని మా ఎడిటరు గారి ఆజ్ఞ. వచ్చే ఆదివారం కొన్ని లక్షల మంది ఆంధ్రులు మీ గురించి చదువుతారు. మరి ప్రారంభించుదామా?"

"ఐయామ్ సారీ, మిస్టర్. . ."

డాక్టరు ఆగిపోయాడు.

"నా పేరు శర్మ."

"సారీ, శర్మగారూ. నాకు ఇష్టం లేదు" అన్నాడు డాక్టరు.

"అదేమిటి? ఈవేళ ఇంటర్వ్యూకు మీరు సమ్మతించినట్లు మా ఆఫీసుకు లెటరుకూడా వ్రాశారట కదూ?"

"రాసిన మాట నిజమే. కాని, నా మనసు మార్చుకొన్నాను."

ఎందుకో తెలుసుకోవచ్చునా?"

"నాలో విశ్వాసం నశించింది. నా నమ్మకాలు తారుమారయ్యాయి."

"దయచేసి కొంచెం వివరంగా చెప్పండి."

డాక్టరు చాలా సేపటివరకూ మాట్లాడలేదు. మరో సిగరెట్ వెలిగించి ఆలోచిస్తున్నాడు. అతని సంశయాన్ని గ్రహించిన శర్మ— "మీ కేమీ అభ్యంతరం లేకపోతేనే చెప్పండి, డాక్టర్!" అన్నాడు.

"అభ్యంతరమేమీ లేదు. కాని, చెప్పటం-ఎంతవరకు భావ్యంగా ఉంటుందో నని. . . సరే, కానివ్వండి. ఎవరితోనైనా ఒకరితో చెప్పుకోకపోతే నా మనస్సు శాంతించేటట్లు లేదు."

"థాంక్స్ ఫర్ యువర్ కాన్ఫిడెన్స్ ఇన్ మీ!"

"నేను కొత్తగా ఇక్కడ ఉద్యోగంలో చేరినప్పుడు కుటుంబ నియంత్రణ కార్యక్రమాల్లో నాకు అచంచలమైన విశ్వాసం ఉండేది. దేశ సంపదనూ, వ్యక్తి సుఖాన్నీ పెంచటానికి అదొక్కటే మార్గమని నేను నమ్మాను. అదే విశ్వాసం ప్రజల్లో కలిగించటానికి 'మిషనరీ జీల్'తో పనిచేశాను. రాష్ట్రంలో ప్రథమంగా వచ్చానంటే నేను చాలా కష్టపడ్డాను. ప్రజల్లో ఒకడుగా కలిసిపోయాను. నా శక్తివంచన లేకుండా వాళ్ల రోగాలకు మందులిచ్చి నయం చేయడానికి ప్రయత్నించాను. అలా చాలా కాలం కష్టపడితేగాని ప్రజలకు నా మీద విశ్వాసం కలగలేదు. ఎప్పుడైతే అంతటి విశ్వాసం చూరగొన్నానో అప్పటినుంచీ నా పని సులభమై పోయింది. ఈ సమితిలో ప్రజలంతా నే నేది చెపితే అది గుడ్డిగా నమ్మే స్థితికి వచ్చారు. అందువల్లనే నా కిచ్చిన టార్గెట్ మూడు వేల ఆపరేషన్లు అయితే, నేను అయిదు వేలు చేసి రాష్ట్రం మొత్తానికి మొదటివాడుగా వచ్చాను. కాని, ఇప్పుడు నాకు కుటుంబ నియంత్రణలో విశ్వాసం పోయింది. విశ్వాసం లేని నేను కుటుంబ నియంత్రణను గురించి చెప్పటం, మీరు పేపర్లో వెయ్యటం— అంతా పచ్చి బూటకమే అవుతుంది. కాదంటారా?"

"అనలేను. కాని, మీ అభిప్రాయం ఇంత హఠాత్తుగా మారిపోవటానికి ఏదో బలవత్తరమైన కారణమే ఉండి ఉండాలి. అదేమిటో చెప్పలేదు మీరు."

"చెపుతాను, మీకు వినే ఓపిక ఉంటే. . ."

"వినటమే నా వృత్తి. చెప్పండి" అన్నాడు శర్మ.

డాక్టరు చెయిన్ స్మోకర్‌లా ఉన్నాడు. మరో సిగరెట్ వెలిగించి చెప్పటం మొదలెట్టాడు. "ఇదే పల్లెలో ఓబులేసు అనే ఒకతను ఉన్నాడు. వ్యవసాయకూలి. ముగ్గురు పిల్లలు. భార్యా, భర్తా-ఇద్దరూ కష్టించి పని చేసుకొనే వాళ్ళే. ముగ్గురు పిల్లలు దాటితే ఆ కుటుంబం మా పరిభాషలో 'టార్గెట్ కపుల్' అని పిలవబడుతుంది. టార్గెట్ కపుల్ మా దృష్టిలో పడక తప్పదు కదా? అలాగే ఓబులేసు కుటుంబం మా సిబ్బంది దృష్టిలో పడింది. ఆ దంపతుల్లో ఒకరిని ఆపరేషనుకు అంగీకరింప జేయాలని మా వాళ్లంతా చాలా కాలం ప్రయత్నించారు. కాని, వాళ్ళకు అది



వలపు చూపు

చిత్రం— ఎస్. జె. నరసింహారెడ్డి

( సికింద్రాబాద్ )

